FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం
Follow :netifocusnewsdaily
www.netifocusnews.com
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం 30, జనవరి 2026
వెల: రూ.4/-
సంపుటి: 01 సంచిక: 40
పేజీలు: 04
Published From: Hyderabad
Editor: Mankali Tharun

## బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు

# సిట్ నోటీసు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు మధ్యాహ్నం విచారణకు రావాలని ఆదేశం

- నోటీసు కాపీని నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్లి సిబ్బందికి అందజేసిన అధికారులు
- వయసు దృష్ట్యా విచారణ ఇంట్లోనా.. సిట్ ఆఫీసులోనా ఎంచుకునే చాన్స్ ఆయనకే
- రాధాకిషన్‌రావు తదితరులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నించేందుకు అధికారులు సిద్ధం
- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీలో ఉన్నా.. హాజరు కాలేను..
- విచారణకు మరో తేదీని నిర్ణయించాలని కేసీఆర్ సూచన
- ఇది విచారణ కాదు.. ప్రతీకారం: కేటీఆర్ (బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్)
- కుతంత్రాలను ఖండిస్తున్నాం: హరీశ్
- ఎన్నికలున్నందుకే కేసీఆర్‌కు నోటీసులు: కవిత

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణకు సిద్ధంగా ఉండాలంటూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని సిట్ ఏసీపీ వెంకటగిరి.. నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు కాపీని సిట్ అధికారులు.. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్లి, అక్కడి సిబ్బందికి అందజేశారు. "పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో 2024లో క్రైం నంబర్ 243 కింద నమోదైన క్రిమినల్ కేసు విచారణలో భాగంగా వెల్లడైన అంశాల్లో మీ పాత్రకు సంబంధించి విచారణ జరపాల్సి ఉంది" అని.. 160 సీఆర్‌పీసీ కింద ఇచ్చిన ఈ నోటీసులో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు.

2










# అమ్మ ఆగమనం!

- చిలుకలగుట్ట నుంచి 'కుంకుమ భరణి' రూపంలో గద్దెలపైకి చేరుకున్న వనదేవత సమ్మక్క
- 'జై సమ్మక్క.. జై సారలమ్మ..' నినాదాలతో మార్మోగిన మేడారం పరిసర ప్రాంతాలు
- గాల్లోకి కాల్పులు జరిపి ఘన స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్
- నేడు భారీ ఎత్తున దర్శనం చేసుకోనున్న భక్తులు

2

మేడారం జాతర నేపథ్యంతో ఆ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. శుక్రవారం వేకువ జామున సమక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు భక్త జనం పోటెత్తారు. జంపన్న వాగులో స్నానాలు ఆచరించి.. మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో కిలోమీటర్ల మేరన ట్రాఫిక్ జామ్ అయ్యింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మేడారం జాతరలో గత రాత్రి ప్రధాన ఘట్టం పూర్తైన సంగతి తెలిసిందే. చిలకలగుట్ట నుంచి సమక్క తల్లి గద్దెపై కొలువుదీరింది. ఆ క్షణంలో భక్త జనం ఉద్వేగానికి లోనయ్యారు. ఇవాళ వన దేవతలను భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు. రేపు సాయంత్రం వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది. ఈ నేపథ్యంలోఈ రెండ్రోజుల్లో లక్షల మంది జాతరకు పోటెత్తే అవకాశం కనిపిస్తోంది.




## వరంగల్ ఎయిర్‌పోర్టుపై

# ముందడుగు!

- మామునూరులో సేకరించిన భూ పత్రాలు కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు అప్పగింత
- రూ.850 కోట్లతో నిర్మాణం.. రెండేళ్లలో పూర్తి చేస్తాం
- తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ: రామ్మోహన్
- హైదరాబాద్‌లో ముగిసిన'వింగ్స్ ఇండియా 2026' ప్రదర్శన

హైదరాబాద్/వరంగల్ ,
(నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 29:

ఓరుగల్లు ప్రజల దశాబ్దాల కల మామునూరు విమానాశ్రయం సాకారం దిశ గా కీలక ముందడుగు పడింది. విమానా శ్రయం కోసం సేకరించిన భూములను రాష్ట్ర ప్రభుత్వం భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ)కి అప్పగించింది. రాజధాని హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న 'వింగ్స్ ఇండియా' కార్యక్రమంలో గురువారం కేం ద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకు ఈ భూముల పత్రాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమా ర్క అందజేశారు. రూ.850 కోట్లతో మామునూరు విమానాశ్రయం రన్‌వే, ఆధునిక టెర్మినల్ భవనాల నిర్మాణం చేపట్టామని.. రెండేళ్లలో పనులు పూర్తి చేసి అందుబా టులోకి తీసుకువస్తామని రామ్మోహన్‌నా యుడు ఈ సందర్భంగా చెప్పారు. 2014 లో దేశంలో 74 విమానాశ్రయాలు మాత్ర మే ఉంటే.. ఇప్పుడు 164కి చేరాయని, త్వరలో వీటిని 300కు పెంచడమే లక్ష్యం గా మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎంత కట్టుబడి ఉంటానో, తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అంతే శ్రద్ధ చూపిస్తానని చెప్పారు.

మిగతా 2లో..

# బాసర టూ భద్రాచలం..

- గోదావరి పరీవాహక గుడులన్నీ అభివృద్ధి
- మేడారం మాస్టర్ ప్లాన్ సిద్ధం
- జంపన్న వాగులో నిత్యం రామప్ప నీళ్లు
- జాతర భక్తులకు సకల సౌకర్యాలు
- కావాలని చేసే దుష్ప్రచారాన్ని నమ్మొద్దు
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క




మేడారం ప్రతినిధి,
(నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 29:

బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని రాష్ట్రంలోని ఆలయాలన్నీ అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివ్‌సరెడ్డి చెప్పారు. రూ.250 కోట్ల నిధులతో వాటి అభివృద్ధికి మేడారంలోనే జరిగిన క్యాబినెట్ సమావేశం తీర్మానించిందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి మేడారం గద్దెల ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. కుంభమేళాను తలపించేలా మేడారానికి భక్తులు పోటెత్తుతున్నారన్నారు. జాతరకొచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లన్నీ చేశామని, కావాలని చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు. ఇప్పటికే సుమారు 80 లక్షల మేర వచ్చినట్లుగా అధికారులు నిర్ధారించారని తెలిపారు. మేడారం జాతరకు కేంద్రం అంతంత మాత్రంగా మాత్రమే నిధులు కేటాయించిందని ఆయన ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా రూ.3.26 కోట్ల

మిగతా 2లో..



## బ్రాండ్ అంబాసిడర్లుగా..

# అవకాశాలను చెప్పండి

- హార్వర్డ్‌లోని భారతీయ విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ పిలుపు
- నేటితో ముగియనున్న క్లాసులు
- రేపు సర్టిఫికెట్ ప్రదానం
- ఆదివారం అమెరికా నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 29:

తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని హార్వర్డ్ యూనివర్సిటీలోని భారత విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని అవకాశాలను ఇక్కడ తెలియజేయాలని, తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో సర్టిఫికెట్ కోర్సును అభ్యసిస్తున్న సీఎం రేవంత్‌ను అక్కడ

మిగతా 2లో..

## సరికొత్త గరిష్ఠానికి

# బంగారం

ఒక్కరోజే రూ.12,000 పెరిగిన ధర

2



# ఏఐతో జాబ్స్‌కు పెను ముప్పు!

- ఏఐ రంగంలో అమెరికా అలవిమాలిన పెట్టుబడులు
- 2008 తరహా సంక్షోభానికి వరకు అవకాశం
- 2025-26 జాతీయ ఆర్థిక సర్వే అంచనాలు
- అనిశ్చితిలోనూ జీడీపీ వృద్ధి రేటుకు అవకాశం
- ప్రవాసులు పంపింది రూ.12.5 లక్షల కోట్లు
- రూ.64.5 లక్షల కోట్ల విదేశీ మారక నిల్వలు
- కావాలంటే దాంతో విదేశీ అప్పు మొత్తం తీర్చొచ్చు
- వేగంగా పెరుగుతున్న నగరాలు..
- తెలంగాణకు సొంత పన్నుల నుంచే అధిక ఆదాయం
- కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులతో సాగు విస్తీర్ణం పెరిగింది
- రాష్ట్ర ద్రవ్యోల్బణం కూడా తగ్గుతోంది: కేంద్ర ఆర్థిక సర్వే

2

# కేసీఆర్‌కు సిట్ నోటీసు

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 29:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణకు సిద్ధంగా ఉండాలంటూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామమని సిట్ ఏసీపీ వెంకటగిరి.. నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు కాపీని సిట్ అధికారులు.. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్లి, అక్కడి సిబ్బందికి అందజేశారు. ''పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో 2024లో క్రైం నంబర్ 243 కింద నమోదైన క్రిమినల్ కేసు విచారణలో భాగంగా వెల్లడైన అంశాల్లో మీ పాత్రకు సంబంధించి విచారణ జరపాల్సి ఉంది'' అని.. 160 సీఆర్‌పీసీ కింద ఇచ్చిన ఈ నోటీసులో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. అయితే, కేసీఆర్ వయసు రీత్యా హైదరాబాద్ పరిధిలో ఆయన కోరిన స్థలంలో దర్యాప్తు అధికారి, ఆయన బృందం విచారణ చేపడతారని, లేదా ఆయన సిట్ కార్యాలయానికి హాజరుకావచ్చని.. ఏ విషయాన్నీ దర్యాప్తు అధికారికి తగు ముందస్తు వ్యవధిలో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు అరెస్టు అయిన పోలీసు అధికారులు.. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నల వాంగ్మూలాల్లో పలుచోట్ల తమకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని, పెద్దాయన ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేశామని చెప్పారు. నాటీ సీఎంవో గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావును విచారించినప్పుడు.. తనకు పైనుంచి ఆదేశాలు అందిన విషయాన్ని ఆయన అంగీకరించారు. దీంతో ఆ ఆదేశాలెవరు ఇచ్చారన్న విషయాలను తెలుసుకోవడానికి కేటీఆర్, హరీశ్, సంతోష్‌లను సిట్ అధికారులు ఇటీవల విచారించారు. విచారణలో వారందరూ పేర్కొన్న అంశాలు, తమ అనుమానాలు, దర్యాప్తులో వెలుగుచూసిన విషయాల ఆధారంగా ఇప్పటి వరకూ జరిగిన దర్యాప్తు.. వీటన్నింటిపై సిట్ చీఫ్ వీసీ సజ్జనార్ సమీక్ష నిర్వహించిన తర్వాత, కేసీఆర్‌ను విచారించడానికి సిట్ అధికారులు సిద్ధమయ్యారు. మావోయిస్టుల పేరిట.. విపక్ష నేతలు, వారి కుటుంబసభ్యులతోపాటు, బీఆర్ఎస్ నాయకులు, జర్నలిస్టులు, పారిశ్రామిక వేత్తలు, న్యాయమూర్తులు, సెలబ్రిటీల ఫోన్లను ట్యాపింగ్ చేయించడంతో పాటు వారిపై నిరంతర నిఘా కొనసాగించడానికి ఒకవైపు నిఘా బృందాలను, మరోవైపు టాస్క్‌ఫోర్స్ బృందాలను గత సర్కారు వాడుకుందని నిరూపించే పక్కా అధారాలను సిట్ ఇప్పటికే సేకరించినట్టు సమాచారం! వీరిలో కొందరిపై నిఘా పెట్టాలని పెద్దాయన చెపితే మరికొందరిపై నిఘా పెట్టాలని చిన్నాయన, ఇంకొందరిపై నిఘా పెట్టాలని కేసీఆర్ కుటుంబసభ్యులు, బంధువులు అడిగారని.. ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌ను దుర్వినియోగపరిచారని సీనియర్ పోలీసుఅధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. ఇలా తెలుసుకున్న సమాచారం ఆధారంగా.. బెదిరించి రూ.కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఇప్పించుకున్నారన్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరుగుతోందని వారు చెబుతున్నారు.



### మునిసిపోల్స్ బిజీలో ఉన్నా..హాజరు కాలేను

మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల విచారణకు హాజరుకాలేని పరిస్థితిలో ఉన్నానని, విచారణకు మరోతేదీని నిర్ణయించాలని కేసీఆర్ సూచించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరికి గురువారం ఆయన లేఖ రాశారు. బాధ్యతాయుత పౌరుడిగా విచారణకు సహకరిస్తానని పేర్కొన్నారు. కానీ, మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ తరపున అభ్యర్థులకు బి-ఫారాలు, ఇతర అధికారపత్రాలు జారీచేయడంలో తాను చాలా బిజీగా ఉన్నానని, అందుకే విచారణకు హాజరు కాలేకపోతున్నానని వివరించారు. తన నివాసం సిద్దిపేట జిల్లా, మర్కూక్ మండలం, ఎర్రవల్లి గ్రామంలోని ఇంటి నంబర్ 3-96లో ఉందని, అక్కడికే వచ్చి విచారణ జరపాలని ఏసీపీని కోరారు. కేసీఆర్ లేఖపై సిట్ సానుకూలంగా స్పందించిందని.. విచారణకు మరో తేదీని ఖరారుచేసి సమాచారం ఇవ్వాలని సిట్ చీఫ్ నిర్ణయించినట్లు సమాచారం.

### ఇది విచారణ కాదు.. ప్రతీకారం: కేటీఆర్



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌కు సిట్ నోటీసు ఇవ్వడం దుర్మార్గమని, ఇది విచారణ కాదని.. ప్రతీకారమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతు బంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన విజనరీ నాయకుడికి నోటీసు ఇవ్వడం కక్ష సాధింపునకు నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు కేసీఆర్ అని, బెదిరింపులతో చరిత్రను చెరిపేయలేరని స్పష్టం చేశారు.

### కుతంత్రాలను ఖండిస్తున్నాం: హరీశ్

కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్‌ను టచ్ చేయడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని గురువారం 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన కేసీఆర్ వంటి నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని విమర్శించారు. సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు సిట్ పేరుతో నోటీసులు జారీ చేయడం రేవంత్‌రెడ్డి చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. కాగా, కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేతలు కొప్పుల ఈశ్వర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు.

### ఎన్నికలున్నందుకే కేసీఆర్‌కు నోటీసులు: కవిత

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నేరస్థులు దాని పర్యవసానాలను ఎదుర్కొంటారా? లేదా? అన్నది వేచి చూడాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసు జారీ నేపథ్యంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మునిసిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని అన్నారు. గుంపు మేస్త్రీ వేసిన సిట్ విచారణ నాన్ సీరియస్‌గా జరుగుతోందని పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది కచ్చితంగా బాధాకరమైన అంశమని, ఈ అంశంపై విచారణను పూర్తి చేసి కేసును తుది దశకు చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది కచ్చితంగా బాధాకరమైన అంశమని, ఈ అంశంపై విచారణను పూర్తి చేసి కేసును తుది దశకు చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా లేదని, ఇందులో వారి ఉద్దేశమేంటో ఎవరికీ అర్థంకాని పరిస్థితి నెలకొందని కవిత విమర్శించారు.

# అమ్మ ఆగమనం!

హైదరాబాద్/మేడారం ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 29:



తన భక్తుల మీద వరములు చిలకరించేందుకు చిలుకలగుట్ట నుంచి కదిలివచ్చింది సమ్మక్క తల్లి! తనను నమ్ముకున్న భక్తులకు కష్టాల చీకట్లను తరమికొట్టి, వారిని సల్లంగ చూసేందుకు చల్లని పున్నమి వెన్నెల కాంతుల నడుమ మేడారం గద్దెపై ఆసీనురాలైంది. ఈ అపూర్వ ఘట్టాన్ని వీక్షించిన భక్త జనులు ఆనందపారవశ్యంతో 'జై సమ్మక్క.. జైజై సమ్మక్క' అంటూ జయజయధ్వానాలు చేశారు. ఇలా రెండోరోజైన గురువారం మేడారంలో అత్యంత కీలక ఘట్టం పూర్తవ్వడంతో మహాజాతర పతాకస్థాయికి చేరింది. డోలూ సన్నాయి వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ సరిగ్గా రాత్రి 9:47 గంటలకు సమ్మక్క గద్దెపైకి చేరుకుంది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు బుధవారమే గద్దెల పైకి చేరుకున్నారు. సమ్మక్క రాకతో నలుగురు దేవతలు ప్రభుత్వం ఆధునికీకరించిన గద్దెలపై కొలువుదీరడంతో జాతర పరిపూర్ణతను సంతరించుకుంది. సమ్మక్కను గద్దెపైకి చేర్చే కార్యక్రమంలో గిరిజన పూజారులు తెల్లవారుజాము నుంచే నిమగ్నమయ్యారు. తెలతెలవారుతుండగానే మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకొని ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పేడతో చక్కగా అలికి.. తోరణాలు కట్టి.. ముగ్గులు వేశారు. అడవికి వెళ్లి వనాన్ని తీసుకొచ్చారు. ఉదయం 9 గంటలకు డప్పుచప్పుళ్ల మధ్య వనాన్ని తీసుకొస్తుండగా సమ్మక్క గుడి సమీపంలో బొడ్రాయి వద్ద మహిళలు నీళ్ల బిందెలతో ఎదురొచ్చి పూజారుల కాళ్లు కడిగారు. మంగళహారతులు పట్టారు. వనం తీసుకువచ్చే కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మధ్యాహ్నం పూజారి సిద్దబోయిన మునేందర్ ఇంట్లో ఆడేరాలను (పసిడి కుండలు) సిద్ధం చేశారు. డోలు వాయిద్యాల మధ్య వాటిని సమ్మక్క గుడికి తరలించారు. గుడిలో తల్లికి సంబంధించిన మిగతా పూజా సామగ్రిని శుద్ధి చేశారు. పూజల అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చారు. అనంతరం సాయంత్రం ఐదింటికి ప్రధాన పూజారి అయిన కొక్కెర కృష్ణయ్య, మరో ఆరుగురు పూజారులు మాల్యాల సత్యం, సిద్దబోయిన మునీందర్, సిద్దబోయిన బొక్కన్న, కొమ్ము స్వామి, కొమ్ము జనార్దన్.. చిలుకల గుట్టకు బయలుదేరారు. గుట్టపైకి కొంత దూరం వెళ్లాక ప్రధాన పూజారి మిగతా వారు ఆగిపోగా.. కృష్ణయ్య ఒక్కరే గుట్ట పైభాగాన తల్లి స్థావరం వద్దకు వెళ్లారు. అక్కడ సుమారు రెండు, మూడు గంటల పాటు ఆయన రహస్య పూజలు నిర్వహించారు. ఆ తర్వాత తల్లి రూపమైన కుంకుమ భరిణను తీసుకొని బయలుదేరారు. మార్గమధ్యలో వేచివున్న మిగతా పూజారులతో కలిసి కిందకు బయలుదేరారు. మంత్రులు సీతక్క, పొంగులేటి, అడ్లూరి లక్ష్మణ్, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో పాటు వేలసంఖ్యలో భక్తులు ఎదురుచూస్తుండగా భరిణ రూపంలో ఉన్న సమక్కతో పూజారులు వచ్చారు. సమ్మక్కతల్లి రాకను పురస్కరించుకొని, ఆ తల్లికి గౌరవ సూచకంగా ములుగు ఎస్పీ సుధీర్ ఏకే 47తో గాల్లోకి నాలుగు రౌండ్లు పేల్చి వందనం సమర్పించారు. అనంతరం చిలుకల గుట్ట ప్రధాన ద్వారం వద్ద మరోదఫా మూడు రౌండ్లు గాల్లోకి పేల్చి తల్లి వస్తున్నట్టుగా భక్తులకు సంకేతాలు పంపారు. సమ్మక్కను పూజారులు మార్గమధ్యలో మేడారంలోని ఆమె గుడికి తీసుకువెళ్లారు. అక్కడ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సమ్మక్కను అక్కడి నుంచి తరలివస్తుండగా తల్లిని దర్శించుకునేందుకు దారి పొడవునా వేలాది మంది భక్తులు బారులు తీరి నిల్చున్నారు. పూజారులతో పాటు గద్దెల వరకు వెంటనడిచారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. తల్లి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పూజారులు తల్లిని గద్దెపై ప్రతిష్ఠించే సమయంలో భక్తుల దర్శనాలను కొద్దిసేపు నిలిపివేశారు. కరెంట్ సరఫరాను కూడా బంద్ చేశారు. సమ్మక్కను గద్దెపై నిలిపిన తర్వాత పది నిముషాల పాటు రహస్య పూజలు నిర్వహించి వెనుదిరిగిన తర్వాత తల్లి దర్శనానికి అనుమతిచ్చారు.

# ఏఐతో ఉద్యోగాలకు పెను ముప్పు!

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 29:

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్న నాలుగు రోడ్ల కూడలిలో నిలబడిందని జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. అయితే, బడాబడా కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రభుత్వం దగ్గర దాదాపు రూ.65 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నాయని, అందులో ఈ ఏడాది ప్రవాసులు పంపిన డబ్బులే రూ.12 లక్షల కోట్లు ఉంటాయని తెలిపింది. దేశంలో ఊబకాయం అతిపెద్ద ఆరోగ్య సమస్యగా అవతరించిందని ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం, కదలకుండా కూర్చోవడం కలగలిసి చిన్న పెద్దా పల్లె పట్నం తేడా లేకుండా అందర్నీ మధుమేహం, గుండె జబ్బులు, రక్తపోటు బారిన పడేట్లు చేస్తున్నాయని గణాంకాలతో ప్రస్తావించింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం పదిహేనేళ్లలో 40 రెట్లు పెరిగిందని, ఊబకాయం రెండింతలు అయిందని వెల్లడించింది. పిల్లలు మెలకువగా ఉన్న సమయంలో టీవీల్లో ఫుడ్ యాడ్‌లు రాకుండా చూడాలని, నూనె, ఉప్పు, చక్కెర ఎక్కువగా వాడే ఆహారంపై సిగరెట్ల లాగా చట్టబద్ధమైన హెచ్చరికలు పెట్టాలని సలహా ఇచ్చింది. డిజిటల్ అడిక్షన్ జాతీయ ఆరోగ్య సమస్యగా పరిణమించిందని, ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం, సోషల్ మీడియా స్క్రోల్ చేయడం వల్ల యువత సామాజిక బంధాలను పూర్తిగా కోల్పోవడమే కాకుండా తెలివితేటలు కూడా దెబ్బతింటున్నాయని తెలిపింది. జీడీపీలో డిజిటల్ ఎకానమీ నుంచే వస్తున్న నేపథ్యంలో రెండింటినీ సమన్వయం చేయాలని సూచించింది. విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. యూత్ హబ్‌లు ఏర్పాటు చేసి యువత కలుసుకొనే వేదికలు కల్పించాలని చెప్పింది. 1.2 కోట్ల గిగ్ వర్కర్లలో 40 శాతం మందికి నెలకు రూ.15 వేలు కూడా రావడం లేదని సర్వే ప్రస్తావించింది. గంటకు లేదా టాస్క్‌ను బట్టి ఇంత కనీస వేతనం ఉండేట్లు నిబంధనలు పెట్టాలని సూచించింది.



## వరంగల్ విమానాశ్రయంపై ముందడుగు!

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి రెండో రాజధాని వరంగల్: మంత్రులు

మామునూరు విమానాశ్రయం ఏర్పాటుతో వరంగల్ రాష్ట్రంలో రెండో రాజధానిగా అవతరించనుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రైతుల సహకారంతో పారదర్శకంగా భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని.. భవిష్యత్తులో ఆదిలాబాద్, కొత్తగూడెం విమానాశ్రయాలనూ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్ సంకల్పంతో విమానాశ్రయ భూసేకరణ సాధ్యమైందని.. విమానాశ్రయం పూర్తయ్యాక ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చారిత్రక ఓరుగల్లు ప్రజల కలను కాంగ్రెస్ ప్రభు త్వం సాకారం చేస్తోందని మంత్రి కొండా సురేఖ అన్నారు.

### విమానయాన రంగానికి ఆకాశమే హద్దు

దేశంలో విమానయాన రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను ఇస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఆకాశమే హద్దుగా ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయని, ఈ రంగంలోని వ్యాపారవేత్తలు, స్టార్టప్ నిపుణులు, కంపెనీలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'వింగ్ ఇండియా-2026' ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర మంత్రి సమక్షంలో దేశ, విదేశాలకు చెందిన విమానయాన కంపెనీలు పలు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. అనంతరం దేశంలో ఉత్తమ విమానాశ్రయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు, ఉత్తమ విమానయాన సంస్థగా ఎయిరిండియా, సర్వీస్ ప్రొవైడర్స్ కేటగిరీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్, విమానయాన ఉత్పత్తుల కేటగిరీలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌కు, ఏవియేషన్ రంగంలో అద్భుత ప్రోత్సాహకాలు ఇస్తున్న తెలంగాణకు, ఏవియేషన్ రంగం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందు కెళుతున్న ఏపీకి అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. విమాన విడిభాగాలు, ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ దేశీయ కంపెనీ లు సత్తా చాటాలన్నారు. భారత విమానయాన రంగానికి భవిష్యత్తులో 30వేల మందికిపైగా పైలట్ల అవసరం ఉందన్నారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. విమానయాన రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2047నాటికి తెలంగాణను ప్రముఖ ఏరో స్పేస్ హబ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు.

## సరికొత్త గరిష్ఠానికి బంగారం

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 29:

ఢిల్లీ మార్కెట్లో గురువారం 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.83 లక్షలు పలికింది. బుధవారంతో పోల్చితే ధర ఒక్క రోజే రూ.12,000 పెరిగింది. మంగళవారం బంగారం ధర రూ.1.71 లక్షల వద్ద ముగిసింది. బంగారం ధరలో ఇది కొత్త రికార్డు. కిలో వెండి ధర సైతం బుధవారంతో పోల్చితే రూ.19,500 పెరిగి రూ.4,04,500 పలికింది. 3 వరుస సెషన్లలో వెండి ధర రూ.67,500 పెరిగింది. ఈ జనవరిలో ఇప్పటివరకు వెండి ధర రూ. 1,65,500 పెరిగింది. డిసెంబరు చివరిలో కిలో వెండి ధర 2.39 లక్షలతో పోల్చితే ఈ 29 రోజుల్లో ధర దూసుకుపోయింది. ఇది శతాబ్దికి ఒక్కసారి మాత్రమే వచ్చే అవకాశమని, అందుకే ధరలు ఇలా దూసుకుపోతున్నాయని పీఎల్ క్యాపిటల్ డైరెక్టర్ సందీప్ అన్నారు.

## బ్రాండ్ అంబాసిడర్లుగా.. అవకాశాలను తెలియజేయండి

(మొదటి పేజీ తరువాయి)

చదువుతున్న భారతీయ విద్యార్థి బృందం తమ క్యాంప్‌సను సందర్శించాలని ఆహ్వానించింది. ఈమేరకు తన అసైన్మెంట్లు, హోం వర్క్‌లు పూర్తయిన తరువాత రేవంత్ విద్యార్థులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన రాజకీయ ప్రస్థానం, సీఎం కావడానికి దోహదపడిన అంశాలతోపాటు తన విజయ మంత్రాన్ని వారికి వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన తెలంగాణ రైజింగ్ విజన్‌ను తెలియజేశారు. భారత్ అభివృద్ధిలో విద్యార్థులు కీలకమని, వారి ప్రతిభ దేశాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. కాగా, హార్వర్డ్ యూనివర్సిటీలో సీఎం రేవంత్ హాజరవుతున్న సర్టిఫికెట్ కోర్సు క్లాసులు శుక్రవారంతో ముగియనున్నాయి. శనివారం సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం ఆయన అమెరికా నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనం కానున్నారు.

## బాసర టూ భద్రాచలం..

(మొదటి పేజీ తరువాయి)

నిధులను కేంద్రం కేటాయించిందని చెప్పారని, జాతరకు జాతీయ హోదా కల్పించాలంటే ఆయన స్పందించలేదని పొంగులేటి వెల్లడించారు. కాగా, మేడారం జాతర మాస్టర్‌ప్లాన్ సిద్ధమైందని, త్వరలోనే శాశ్వత నిర్మాణాలు చేపడుతామన్నారు. ఇందు కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించగా, మరో 42 ఎకరాలు సేకరిస్తామని పొంగులేటి తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధికి కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, ఏకో పార్కులతోపాటు శాశ్వత ప్రాతిపదికన టాయిలెట్లు, మరుగుదొడ్లను నిర్మిస్తామన్నారు. రామప్ప నుంచి లక్నవరం.. లక్నవరం నుంచి జంపన్న వాగులోకి నీటిని మళ్లిస్తామన్న మంత్రి పొంగులేటి.. 365 రోజులు జంపన్న వాగులో నీళ్లు ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ సీఎం రేవంత్ అప్పగించిన బాధ్యతను మంత్రి సీనన్న సమర్థవంతంగా నిర్వర్తించారని కొనియాడారు. రోడ్లను వెడల్పు చేయడంతో జాతర పరిసర ప్రాంతాలు విశాలంగా మారాయని, దీంతో ఇబ్బందుల్లేకుండా అమ్మవార్లను భక్తులు దర్శించుకుంటున్నారని చెప్పారు.

# తెలంగాణలో పట్టణ పోరుకు రంగం సిద్ధం !



ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగ. సవాళ్లు, ప్రతి సవాళ్లతో కాలం గడిపేయవచ్చు. అనుయాయులను గెలిపించుకునేందుకు ఆరాటపడం తప్ప మరోటి ఉండదు. మొన్నటికి మొన్న తెలంగాణలో గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సందడి ముగిసింది. ఇప్పుడు మున్సిపల ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ పార్టీల్లో హడావిడి జోరందుకుంది. పార్టీ పరంగానే ఎన్నికలు జరగనున్న కారణంగా అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే మున్సిపాలిటీల్లో పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా మున్సిపల్ పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలయ్యింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మొత్తంగా పంచాయితీ తరవాత ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయ్యింది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. షెడ్యూల్ విడుదలతో పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టణాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో అభ్యర్థులు తలమునకల య్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గు చూపుతారు. పురపోరులో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇదిలా ఉంటే పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ గుర్తింపు ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. పట్ట ణాలు, వార్డుల్లో మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుం డటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా పట్టణాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

### బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు సిట్ నోటీసులు

### నేటి మధ్యాహ్నం విచారణ చేపడతామని వెల్లడి

**హైదరాబాద్,జనవరి29(నేటి ఫోకస్ న్యూస్):**
ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు మాజీ ఎంపీ సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు

కేటీఆర్, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్‌నూ విచారించాలని సిట్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

# జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి

### పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే

### ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

**అనకాపల్లి,జనవరి29(నేటి ఫోకస్ న్యూస్):**
దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వే ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగు తోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బ్జడెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల

విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# అదృష్టంతో విజయం వరించదు



### కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం

### గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానమే లక్ష్యం

### హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సిఎం రేవంత్

**హైదరాబాద్,జనవరి29(నేటి ఫోకస్ న్యూస్):**
విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని సిఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో విద్యార్థులకు బోధించారు. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు సిఎం రేవంత్ క్యాంపస్‌ను సందర్శించారు . ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశర చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లో నూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశర చేశారు. భారతీయ యువత మేధస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

# వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నంలో సిట్

### కెసిఆర్‌కు నోటీసులపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్,జనవరి29(నేటి ఫోకస్ న్యూస్):**



జరిగిన వాస్తవాలు తెలుసుకోవడానికి సిట్ ఎవరికైనా నోటీసులు ఇవ్వొచ్చని స్పష్టం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేశారు. సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే తెలుస్తుందని.. నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. ఈ విషయంలో వాస్తవాలు వెలుగులోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులపై ఆయన స్పందించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. ఆనాడు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలు లేకుండా అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడరని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఎవరు భాగస్వాములో తేలాల్సి ఉందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో పారదర్శక విచారణ జరగాలని కోరారు మహేశ్ కుమార్. 500కు పైగా ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేశారనే సమాచారం ఉందని చెప్పుకొచ్చారు.

# భక్తజన సంద్రంగా మేడారం

### లక్షలాదిగా తరలివస్తున్న జనం

**ములుగు,జనవరి29(నేటి ఫోకస్ న్యూస్):**
ఆసియాలోనే అతి పెద్ద జాతరైన మేడారంలో వరుసగా కీలక ఘట్టాలు చోటు చేసుకుంటున్నాయి. సారలమ్మ బుధవారం గద్దెపైకి చేరుకోగా.. సమ్మక్క గద్దెనెక్కనున్నారు. ఇందుకోసం చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి రానున్నారు. ఈ నేపథ్యంలో భక్తజనం పులకించనుంది.

సమ్మక్క రాకతో ఈ జాతర పరిపూర్ణం కానుంది. గురువారం అర్ధరాత్రి నుంచి వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు. మరోవైపు ఇప్పటికే ఈ జాతర సందర్భంగా మేడారం భక్తులతో కిక్కిరిసిపోయింది. నేపథ్యంలో మేడారంలో భారీగా పోలీసులు మోహరించారు. ఇక రాష్ట్ర రెవెన్యు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.. జాతర ఏర్పాట్లను స్వయంగా బైక్ నడుపుతూ పరిశీలించారు. జనవరి 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది మేడారం తరలిరానున్నారు. వనదేవత సమ్మక్క.. గురువారం గ్దదెపైకి రానున్న నేపథ్యంలో



అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏర్పాట్లపై జిల్లాకు చెందిన మంత్రి సీతక్క ఇప్పటికే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

# హెచ్-1బీ వీసాల దుర్వినియోగం


### విచారణకు దిగిన టెక్సాస్

**న్యూయార్క్,జనవరి29(నేటి ఫోకస్ న్యూస్):**
హెచ్-1బీ వీసాల దుర్వినియోగం ఆరోపణలపై టెక్సాస్ చర్యలు చేపట్టింది. స్థానికంగా ఉన్న కొన్ని సంస్థలను లక్ష్యంగా చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టింది. ఈ మేరకు టెక్సాస్ ఆఫీస్ ఆఫ్ అటార్నీ జనరల్ తాజాగా ఓ ప్రకటనను విడుదల చేసింది. ఉత్తర టెక్సాస్‌కు చెందిన మూడు సంస్థలకు సివిల్ ఇన్వెస్టిగేషన్ డిమాండ్స్ జారీ చేసినట్లు అటార్నీ జనరల్ కెన్ పాక్స్టన్ ఆ ప్రకటనలో వెల్లడించారు. దీంతో ఆ కంపెనీలు తమ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, నియామక విధానాలకు సంబంధించిన పత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు 'ఘోస్ట్' సంస్థలను సృష్టించి హెచ్-1బీ వీసాలను పొందేందుకు మోసపూరిత విధానాలను అనుసరించి ఉంటారని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే, ఆ కంపెనీలు ఏంటనే వివరాలను మాత్రం అటార్నీ జనరల్ కార్యాలయం వెల్లడించలేదు. హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగంపై పెద్దఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతోన్న వేళ.. టెక్సాస్ ఈ దర్యాప్తు చేపట్టడం స్థానికంగా ప్రాధాన్యం సంతరించు కుంది. ఇప్పటికే కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులను తక్షణం నిలిపివేయాలని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. హెచ్-1బీ వీసాల జారీ దుర్వినియోగం అవుతోందని, స్థానిక ఉద్యోగాలు అమెరికన్ కార్మికులకే చెందాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రెగ్ అబాట్ ప్రకటించారు. 2027 మే 31 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందన్నారు.

# ఉస్తాద్' పాటలపై ఫ్యాన్స్ ఆసక్తి

పవన్ కల్యాణ్ తో దేవిశ్రీ ప్రసాద్ కాంబో ఎప్పుడూ మిస్‌ఫైర్ కాలేదు. 'జల్సా' పాటలన్నీ సూపర్ హిట్టే. 'గబ్బర్ సింగ్' అయితే.. ఇక చెప్పాల్సిన పనిలేదు. 'సర్దార్ గబ్బర్ సింగ్' సినిమా ఫ్లాప్ అయినా, ఆల్బమ్ మాత్రం నిరుత్సాహ పరచలేదు. ఇప్పుడు మరోసారి వీరి కాంబోని చూసే ఛాన్స్ దక్కింది. 'ఉస్తాద్ భగత్‌సింగ్' తో. హరిష్ శంకర్‌కు మ్యూజిక్ విషయంలో మంచి టేస్ట్ వుంది. తన సినిమాల్లో పాటలన్నీ బాగుంటాయి. పైగా డీఎస్‌పీతో మంచి రాపో ఉంది. అందుకే 'ఉస్తాద్' లో పాటలెలా ఉంటాయో అని ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఉస్తాద్ నుంచి ఫస్ట్ సింగిల్ గా 'దేఖ్‌లేంగే' రాబోతోంది. ఈరోజు ప్రోమో వదిలారు. 'స్టెప్పేస్తే భూకంపం' అనే హుక్ లైన్ తో ప్రోమో వదిలారు. ఆ కాసేపటి ప్రోమోకే పవన్ ఫ్యాన్స్ ఖుషీ అయిపోతున్నారు. పవన్ లుక్, గ్రేస్, డ్రస్సింగ్‌%% ఇవన్నీ ఫ్యాన్స్‌కి బాగా నచ్చేశాయి. పవన్ పై తన అభిమానాన్ని దేవిశ్రీ మరోసారి ఈ సినిమాతో చాటుకోబోతున్నాడని అనిపిస్తోంది.

ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో కూడా %-%ఉస్తాద్%-% ఆల్బమ్ గురించి ప్రస్తావించాడు దేవిశ్రీ. ఈ సినిమాలో పాటలు అదిరిపోయాయని, తాను ఓ పాట చూశానని, వన్స్ మోర్ అనాలనిపించేలా ఈ పాటన్ని డిజైన్ చేశారని, పవన్ కూడా చాలా కాలం తరవాత స్టెప్పులేయాలన్న ఉత్సాహం చూపించారని చెప్పుకొచ్చాడు దేవి. బహుశా.. ఈ పాటలోనే పవన్ శ్రద్ధగా స్టెప్పులేశారేమో అనిపిస్తోంది. సాధారణంగా ఆల్బమ్ లోని ది బెస్ట్ సాంగ్ నే ఫస్ట్ సింగిల్ గా వదులుతుంటారు. ఈ ఆల్బమ్ లోని బెస్ట్ సాంగ్ కూడా ఇదే అనిపిస్తోంది. ఈనెల 13న పూర్తి పాట బయటకు రాబోతోంది. ఆ రోజు హైదరాబాద్ లో ఓ ఈవెంట్ నిర్వహించే ఛాన్స్ వుంది. మార్చిలో %-%ఉస్తాద్%-%ని రిలీజ్ చేసే ప్లానింగ్ లో ఉన్నారు నిర్మాతలు.




## నారి నారి నడుమ మురారి' సంక్రాంతి రిలీజ్ కి రెడీ

శర్వానంద్ 'నారి నారి నడుమ మురారి' సంక్రాంతి రిలీజ్ కి రెడీ అయ్యింది. సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాని అనిల్ సుంకర నిర్మించారు. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలు. ఈ సినిమా రిలీజ్ టైం లాక్ చేశారు. ఈ సంక్రాంతికి జనవరి 14న సినిమా విడుదల కానుంది. ప్రీమియర్ షో సమయం %-% సాయంత్రం 5:49. సాధారణంగా సినిమాలు ఉదయం లేదా తెల్లవారుజామున షోలతో ప్రారంభమవుతాయి. ఈ సినిమా సాయంత్రం రిలీజ్ ని ఎంచుకుంది శర్వానంద్ నటించిన శతమానం భవతి, ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాలు జనవరి 14న విడుదలయ్యాయి. ఆరకంగా ఈ సినిమాకి పాజిటివ్ సెంటిమెంట్ వుంది. ఈ పండుగకి చాలా పోటీ వుంది. పండగ చివర్లో సినిమాకు కాస్త పోటీ తగ్గుతుంది, సెలవలు కూడా మిగిలే ఉంటాయనే ఆలోచనలో వుంది టీమ్. అందుకే సాయంత్రం ఆటలతో సినిమా మొదలుపెడుతున్నారు. రామ్ అబ్బరాజు మంచి ఫ్యామిలీ టచ్ వున్న సినిమాలు తీసే దర్శకుడు. సామజవరగమన చిత్రానికి పని చేసిన నందు భాను ఈ టీమ్ లోనూ ఉన్నారు. ఇది పక్కగా పండగకి రావాల్సిన సినిమా అని దర్శక నిర్మాతల నమ్మకం. అందుకే ఇంతపోటీలోనూ కూడా వదులుతున్నారు.

# మార్చిలో సినిమా పండగే..

2025 క్లైమాక్స్‌లో ఉన్నాం. ఈ యేడాది జయాపజయాల జాబితా సిద్ధం అవుతోంది. ఈలోగా 2026 ప్రణాళికలు కూడా పటిష్టంగా తయారవుతున్నాయి. 2026 సంక్రాంతికి ఎలాంటి సినిమాలు వస్తున్నాయి అనేదానిపై ఓ స్పష్టత వచ్చేసింది. సంక్రాంతి తరవాత వేసవి సీజన్ చాలా కీలకం. ముఖ్యంగా మార్చి నుంచే హవా మొదలైపోతుంది. ఐపీఎల్ సీజన్ రసవత్తరంగా మారకముందే సినిమాల్ని విడుదల చేయడం మంచిదన్నది నిర్మాతల ఉద్దేశ్యం. అందుకే మార్చి పై గట్టిగా గురి పెడుతున్నారు. 2026 మార్చిలో భారీ సినిమాలు రాబోతున్నాయి. ఈనెలని టార్గెట్ చేస్తూ టాలీవుడ్ లో చాలా సినిమాలు రెడీ అవుతున్నాయి. రామ్ చరణ్ 'పెద్ది' మార్చి ఆఖరి వారంలో తీసుకొద్దామనుకొంటున్నారు. మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలన్నది ప్లాన్. సరిగ్గా అదే సమయానికి నాని 'పారడైజ్'ని తీసుకొద్దాను కొంటు న్నాడు. ఈ రెండు సినిమాలూ ఒక రోజు వ్యవధిలో రావాల్సివుంది.

అయితే.. 'పెద్ది' రిలీజ్ ఖాయమైపోతే.. పార డైజ్ ఓ వారం వెనక్కి లేదా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. పవన్ కల్యాణ్ %-%ఉస్తాద్ భగత్ సింగ్%-% చిత్రాన్నీ మార్చిలోనే విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. చిత్రీకరణ కూడా దాదాపుగా పూర్తయ్యింది. కాబట్టి.. విడుదలకు ఎలాంటి ధోకా లేనట్టే. ఈరోజు నుంచే ప్రమోష న్స్ కూడా మెల్లగా మొదలెడతారు. ఫస్ట్ సింగిల్ పలకరిం చడానికి సిద్ధంగానే వుంది.

మరోవైపు కన్నడ నుంచి 'టాక్సిక్' కూడా మార్చిలోనే విడుదల చేయాలని ఫిక్సయ్యా రు. యష్ నటించిన సినిమా ఇది. తన నుంచి వచ్చిన 'కేజీఎఫ్', 'కేజీఎఫ్ 2' తెలుగులో ఎంతటి ప్రభావా న్ని చూపించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని నిర్మాతలు తాజా గా ప్రకటించారు. మొత్తానికి మార్చిలో ప్రతీ వారం ఓ భారీ సినిమా పలకరించడం ఖాయం. ఏప్రిల్, మేలలో కూడా ఇదే జోరు కొనసాగించే అవకాశం ఉంది. రెండు మూడేళ్లుగా సమ్మర్ సీజన్ని టాలీవుడ్ సరిగా వాడుకోలేదు. ఈసారి మాత్రం ఆ తప్పు చేయకపోవొచ్చు.

# పవన్ కల్యాణ్ ఎవరికి తలవంచడు



## సహజ నటి జయసుధ

మెగా ఫ్యామిలీతో సహజ నటి జయసుధకు బలమైన అనుబంధం ఉంది. మెగాస్టార్ చిరంజీవి, నాగబాబుతోనే కాకుండా పవన్ కల్యాణ్‌తో కలిసి ఆమె పలు చిత్రాల్లో నటించారు. వారి మాదిరిగానే ఆమె కాంగ్రెస్ పార్టీలో కొనసాగి రాజకీయ జీవితాన్ని ముందుకు కొనసాగించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా సేవలు అందించారు. తాజాగా ఆమె రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నారు.సినిమా పరిశ్రమలో బలమైన పాత్రలు వేస్తూ నటిగా కొనసాగుతున్నారు. వివాదాలకు పూర్తిగా దూరంగా ఉండే ఆమె..

తాజాగా ఏపీలో ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమె పవన్ కల్యాణ్ వ్యక్తిత్వం గురించి, ఆయన ప్రొఫెషనల్ విజన్ గురించి మంచి మాటలు చెప్పారు. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతున్నది. జయసుధ చెప్పిన మాటల విషయానికి వస్తే..పవన్ కల్యాణ్ వండర్‌ఫుల్ మ్యాన్. ఆయన యాటిట్యూడ్ విషయంలో యాక్టింగ్ ఉండదు. ఇప్పుడు డిప్యూటీ సీఎం అయినా.. అప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడు అలానే ఉన్నాడు. ఆయనలో ఎలాంటి మార్పు లేదు. సినిమా రంగంలో ఎవరికీ తలవంచలేదు. రాజకీయ రంగంలో కూడా ఎవరికి తలవంచడం లేదు. తనకు ఓ స్టయిల్ ఉంది. తనకు కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి. తనకు పట్టుదల ఉంది కాబట్టే రాజకీయాల్లో అందర్నీ ఎదురించి నిలబడగలిగాడు. పవన్ కల్యాణ్ కాకుండా వేరే వాళ్లు ఉంటే.. ఇప్పటికే వెళ్లిపోయి ఉండే వారు అని సహజ నటి జయసుధ అన్నారు. పవన్ కల్యాణ్ గురించి నాకు బాగా తెలుసు. ఆయన ఏదైనా అనుకొంటే మధ్యలో వదిలేసే రకం కాదు. ఆయన పడిన కష్టం. ప్రజా జీవితం పట్ల ఆయనకు ఉండే సిన్సియారిటీనే ఆయనను ఇంతవరకు తీసుకొచ్చాయి. ఆయన కమిట్‌మెంట్ చూసి ఆయనను అప్రిషియేట్ చేయాలి. ఎందుకంటే.. రాజకీయ రంగంలో కుళ్లును చూసి మనకెందుకులే అని వెళ్లిపోయి ఉండవచ్చు. కానీ అలా చేయలేదు అని జయసుధ అన్నారు. సినిమా రంగంలో ఆయన నటిస్తానని అంటే.. ఎంతైనా, ఏదైనా ఇవ్వడానికి నిర్మాతలు, దర్శకులు రెడీగా ఉన్నారు. కానీ వాటన్నింటిని వదులుకొని ప్రజా జీవితానికే మొగ్గు చూపారు. అందుకు ఆయనను అభినందించాలి. ఇవన్నీ నా వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే అని జయసుధ అన్నారు. పవన్ కల్యాణ్ మంచితనాన్ని జయసుధ ఆకాశానికి ఎత్తేసిన వీడియోను అభిమానులు సోషల్ మీడియాలో షేర్ చేసి ట్రెండ్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ విషయానికి వస్తే.. అటు రాజకీయ రంగంలోను, సినిమా రంగంలోను తనదైన ప్రభావాన్ని చూపుతున్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడమే కాకుండా గతంలో తాను అంగీకరించిన సినిమాలను పూర్తి చేస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన హరిహర వీరమల్లు, ఓజీ చిత్రాలు అభిమానులకు మంచి కిక్ ఇచ్చాయి. ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్ అనే చిత్రంలో నటించారు. త్వరలోనే ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నది.

# 'మోగ్లీ' సినిమా దర్శకుడికి అండగా సాయి ధరం తేజ్

బాలకృష్ణ 'అఖండ 2' అనుకున్న టైమ్ రిలీజ్ అయి ఉంటే ఈ వారం దాదాపు 15 కొత్త సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యేవి. అయితే అఖండ 2 మూవీ అనూహ్యంగా వాయిదా పడడం, రిలీజ్ డేట్ పై ఇంకా క్లారిటీ రాకపోవడంతో ఈ వారం సినిమాల రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. ఒకవేళ 'అఖండ 2' డిసెంబరు 12న బాక్సాఫీసు ముందుకు వస్తే.. ఆ రోజు విడుదలయ్యేందుకు సిద్ధమైన పలు సినిమాలు వాయిదా పడే అవకాశాలున్నాయి. అందులో సుమ కుమారుడు రోషన్ హీరోగా నటించిన మోగ్లీ కూడా ఉంది. కలర్ ఫొటోతో జాతీయ అవార్డు అందుకున్న సందీప్ రాజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. చాలా రోజులుగా కష్టపడి తెరకెక్కించిన మోగ్లీ సినిమా వాయిదా పడే అవకాశాలుండడంతో ఈ ట్యాలెంటెడ్ డైరెక్టర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. 'సినిమాపై ఎంతో ప్యాషన్ ఉన్న వ్యక్తులు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. కలర్ ఫొటో, మోగ్లీ ఈ ఈ రెండు సినిమాలకు సంబంధించి రెండు కామన్ పాయింట్స్ ఏంటంటే.. 1. అంతా సవ్యంగానే జరుగుతోందని అనుకుంటే.. విడుదల విషయంలో దురదృష్టం ఎదురవడం. 2. నేను. నాదే 'బ్యాడ్‌లక్' అనుకుంటున్నా.. 'డైరెక్టెడ్ బై సందీప్‌రాజ్' అని సిల్వర్ స్క్రీన్ పై నా పేరు చూసుకోవాలన్న కల రోజు రోజుకూ కష్టతరమవుతోంది. . రోషన్, సరోజ్, సాక్షి, హర్ష, డీవోపీ మారుతి, మ్యూజిక్ డైరెక్టర్ కాల భైరవ.. ఇలా అంకిత భావం ఉన్న ఎంతోమంది కష్టంతో 'మోగ్లీ' రూపొందింది. వారి కోసమైనా ఈ సినిమా విషయంలో మంచి జరగాలని ఆశిస్తున్నా' అని తన ఆవేదనకు అక్షర రూపమిచ్చారు సందీప్ రాజ్. కాగా సందీప్ ట్వీట్‌పై మెగా హీరో సాయి దుర్గాతేజ్‌స్పందించారు. 'డియర్ సందీప్.. మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఊహించని విధంగా దక్కుతుంది. ధైర్యంగా ఉండండి. మీ విషయంలో మీరు గర్వపడండి. చివరకు సినిమా గెలుస్తుంది' అని సందీప్‌కు భరోసా ఇచ్చాడు సాయి దుర్గాతేజ్. ఇక బేబీ నిర్మాత ఎస్కేఎన్ స్పందిస్తూ.. 'డియర్ సందీప్.. జాతీయ అవార్డు చిత్రం 'కలర్ ఫోటో'లో మీరు ఒక భాగం. ఈ అడ్డంకులన్నీ తాత్కాలికం. దిగులు పడొద్దు. మీ కష్టాన్ని ప్రేక్షకులు గుర్తిస్తారు, మద్దతు ఇస్తారు. ఆల్ ది బెస్ట్' అని విషెస్ చెప్పారు.



## అఖండ 2 విడుదలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్..

ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో అఖండ 2 ఒకటి. భారీ అంచనాల మధ్య రూపొందించిన ఈ సినిమా విడుదల కోసం నందమూరి ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నందమూరి బాలకృష్ణ హీరో డైరెక్టర్ బోయపాటి శ్రీను ఈ మూవీని రూపొందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేశాయి. ఇందులో బాలయ్య నట విశ్వరూపం చూపించనున్నారని ముందు నుంచి పోస్టర్స్, టీజర్ పై బజ్ క్రియేట్ చేశారు మేకర్స్. డిసెంబర్ 5న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. అప్పటికే బాలయ్యతోపాటు చిత్రయూనిట్ సైతం జోరుగా ప్రమోషన్స్ నిర్వహించారు. కానీ చివరి క్షణంలో ఈ సినిమా విడుదలను వాయిదా వేశారు. ఫైనాన్షియల్ వివాదాల కారణంగా ఈ సినిమా రిలీజ్ ఆగిపోయింది.14 రీల్స్ ఎంటర్టైన్మెంట్స్ నుంచి తమకు రావాల్సిన రూ.28 కోట్ల బకాయిని చెల్లించేవరకు అఖండ 2 సినిమాను నిలిపివేయాలని బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఈరోస్ వాదనలతో ఏకీభవించిన కోర్టు అఖండ2 సినిమాపై స్టే విధించింది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన ఫైనాన్షియల్ సమస్యలు అన్ని క్లియర్ అయ్యాయి. దీంతో అఖండ 2 సినిమా విడుదలకు మద్రాసు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలని భావిస్తున్నారట మేకర్స్. ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం అఖండ 2 చిత్రాన్ని డిసెంబర్ 12న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. రెండు తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 11న రాత్రి నుంచి ప్రీమియర్ షోలు పడనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా విడుదల పై అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది . ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా.. తమన్ సంగీతం అందిస్తున్నారు.